క్లుప్తంగా

వల్లూరమ్మ ఆలయ దుకాణాల బహిరంగ వేలం రేపు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో దుకాణాల వేలం బుధవారం నిర్వహించనున్నట్లు ఈఓ రమేష్ తెలిపారు. కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే హక్కు రూ.లక్ష, తలనీలాలు పోగుచేసుకునే హక్కు రూ.25 వేలు, షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపు నంబరు 5, 6, 7, 9కి విడివిడిగా రూ.10 వేల నుంచి వేలం ప్రారంభమవుతుందని సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. దేవదాయ శాఖ అధికారులు, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసరావు పర్యవేక్షణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.68 లక్షలు

సీఎస్ పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,68, 406 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి దర్శనం టికెట్ల అమ్మకం ద్వారా రూ.61,430, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.27,900, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు దాతలిచ్చిన విరాళం రూ.79,046 వచ్చినట్లు చెప్పారు. ఇందులో శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, సీతారామపురం మండలం, పబ్బులేటిపల్లి గ్రామానికి చెందిన బొల్లం శ్రీనివాసులు, పద్మావతి దంపతులు రూ.40 వేలు విరాళం ఇచ్చినట్లు చెప్పారు.

ఉపాధి పనుల తనిఖీ

హనుమంతునిపాడు: మండల పరిధిలోని మొరవారిపల్లి గ్రామంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ఎంపీడీవో ఎం.క్రిష్టారావు సోమవారం పరిశీలించారు. ఈకూలీల మస్టర్లు, చేసిన పనిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన కొలతల మేరకు తప్పనిసరిగా పని చేయాలన్నారు. కొలతల ప్రకారమే కూలీల బిల్లుల చెల్లింపులు ఉంటాయన్నారు. పని కావాల్సిన ప్రతి కూలీ ముందుగా డిమాండ్ నోటీసు ఇవ్వాలన్నారు. పని కావాలని అడిగిన ప్రతి కూలీకి పనిలేదనకుండా కల్పించాలని ఏపీవో వెంకటేశ్వర్లుకు సూచించారు. కార్యక్రమంలో టీఏ రజని, ఎఫ్ఏ లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులను సన్మానించిన అధికారులు


మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

సీఎస్ పురం: మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగులను ఆ కార్యాలయ సిబ్బంది సోమవారం సన్మానించారు. ఈ నెల 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ఈశ్వరమ్మ, సీఎస్ పురం 2, ఉప్పలపాడు పంచాయతీ కార్యదర్శులు వాణి, జయలక్ష్మి, గృహ నిర్మాణశాఖ డేటా ఎంట్రీ ఆపరేటర్ సావిత్రి, ఎంపీడీవో కార్యాలయ సబార్డినేట్ వెంగమ్మను సన్మానించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుందరరామయ్య, ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమేష్ రాజా, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, శ్రీధర్, నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులపై గౌరవం, ప్రేమాభిమానాలు ఉండాలి

పామూరు: పిల్లలకు వారి తల్లిదండ్రులపై గౌరవం, ప్రేమాభిమానాలు ఉండాలని శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ జిలానిబాషా అన్నారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం పేరెంట్స్ గ్లోరీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పిల్లలతో వారి తల్లిదండ్రులకు పాదపూజ చేయించి తల్లిదండ్రులకు బహుమతులు ఇప్పించారు. తల్లిదండ్రులను గౌరవంగా చూసుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీన్ అశోక్‌కుమార్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ బలపరిచిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డికి మద్దతుగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ప్రచారం చేయనున్నట్లు మండల పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది. మంగళవారం ఉదయం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభమవుతుందని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు విజయోత్సవ సంబరాలు

ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయోత్సవ సంబరాలను మంగళవారం మండల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల నాయకులు తెలిపారు. కేక్ కటింగ్ కార్యక్రమంలో వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

ప్రజలకు చేరువగా ప్రభుత్వ వైద్యం


బేబీ ఆఫ్ ఉలవపాడు ఆరోగ్య పోటీల ఏర్పాటు


వైద్యశాలలో ఏర్పాటుచేసిన నవజాత స్థిరీకరణ యూనిట్

- ఉలవపాడు సీహెచ్‌సీలో మెరుగైన సేవలు
- భారీగా పెరిగిన ఓపీ
- దాతల సహకారంతో పరికరాల ఏర్పాటు
- మెరుగైన వైద్యంతో కాయకల్ప అవార్డు


ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాల

ఉలవపాడు: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న ప్రభుత్వ సంకల్పానికి తోడు చిత్తశుద్ధి ఉన్న ప్రజాప్రతినిధులు, సిబ్బంది ఉంటే వైద్య ఫలాలు ప్రజలకు చేరువవుతాయి. అందుకు ఉదాహరణ ఉలవపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రం . గత ఏడాదిగా వినూత్న మార్పులతో ఉత్తమ సేవలందిస్తోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యంపై ప్రత్యేక శ్రద్ధతో వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయడంతో పాటు, ఇక్కడి వైద్యులు పలు కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో సఫలం అయ్యారు. దీని కారణంగా ఏడాది కాలంలో ఓపీ సంఖ్య పెరుగుతూ వస్తోంది. వైద్యుల భర్తీకారణంగా ఆరు నెలల నుంచి ఇక్కడ సర్జరీలు ప్రారంభమయ్యాయి. దీంతో మరింత ఎక్కువగా రోగులు ఇక్కడికి వస్తున్నారు. ప్రధానంగా ప్రసవాలపై దృష్టి సారించడంతో గర్భిణులు అధికంగా వైద్యశాలకు వస్తున్నారు. కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి సహకారంతో దాతలు పలు పరికరాలు, మందులు వైద్యశాలకు అందించడంతో వైద్యులు మరింత బాధ్యతగా పనిచేస్తూ సేవలు అందిస్తున్నారు. ఇన్‌చార్జ్ వైద్యాధికారి సతీష్ బాబు వైద్యశాలలో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో వైద్యశాలకు వచ్చేవారి సంఖ్య పెరిగింది. దీని వలన ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు భరోసా కల్పించినట్లయింది.

వైద్యంపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి:

ఇక్కడ ప్రజలకు నమ్మకం పెరగడానికి ప్రధాన కారణం వైద్యుల పోస్టులు భర్తీ అవడమే. ఆరునెలల క్రితం జరిగిన బదిలీల్లో పూర్తి స్థాయి సిబ్బంది వచ్చారు. 2022 ఏప్రిల్ వరకు ఇక్కడ కేవలం ముగ్గురు వైద్యులు ఉండేవారు. కానీ ఇప్పుడు ఆరుగురు వైద్యులు, ఒక ఫిజియోథెరపిస్టు, మరో దంత వైద్యుడు ఈ వైద్యశాలలో ఉన్నారు. మత్తు డాక్టర్, గైనకాలజిస్టులు రావడంతో వైద్యశాలలో ప్రసవాలు, ఆపరేషన్ల సంఖ్య పెరిగింది. దీనికితోడు కింది స్థాయి సిబ్బంది కూడా తగినంత మంది ఉండటంతో ఓపీ సంఖ్య బాగా పెరిగింది.

దాతల సహకారంతో పరికరాల ఏర్పాటు:

ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి తన సొంత నిధులతో వైద్యశాలలో రూ.1.17 లక్షలతో సీటీజీ మిషన్‌ను అందించారు. రూ.2 లక్షలతో నవజాత శిశుస్థిరీకరణ మిషన్‌ను, రూ.50 వేలతో పంటి ఎక్స్‌రే మిషన్‌ను, రూ.3 లక్షలతో ఫొటో థెరపీ మిషన్‌ను అందజేశారు. ప్రభుత్వం మరో 3 ఫొటో థెరపీ మిషన్లు ఇవ్వడంతో చిన్నారుల కోసం ప్రత్యేక యూనిట్‌ను ప్రారంభించారు. మరమ్మతులకు గురైన స్కానింగ్ మిషన్ స్థానంలో కందుకూరు వైద్యశాల నుంచి స్కానింగ్ మిషన్‌ను, సెల్ కౌంట్ మిషన్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆపరేషన్ థియేటర్‌లో ప్రత్యేక బల్లలు, ఏసీలను ఏర్పాటు చేశారు. వైద్యశాలలో వైద్యానికి సంబంధించిన విషయాలు తెలియచేయడానికి సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. వచ్చిన రోగులకు ఆహ్లాదంగా ఉండడానికి టీవీని ఏర్పాటు చేశారు.

భారీగా పెరిగిన ఓపీ...

ప్రస్తుతం వైద్యశాలలో ఓపీ సంఖ్య భారీ గా పెరిగింది. గత ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు 11,409 ఓపీ ఉండగా తరువాత ఆరు నెలలో 19,751 కి ఓపీ సంఖ్య పెరిగింది. అలాగే గత ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు 42 ప్రసవాలు జరగగా ఈ ఆరు నెలల్లో 213 ప్రసవాలు జరిగాయి. ఈ ఆరు నెలల్లో 39 మేజర్, 140 మైనర్ ఆపరేషన్లు నిర్వహించారు. 320 ఈసీజీలు తీశారు. 25,718 మందికి రక్త పరీక్షలు జరిపారు. ప్రమాదాలు జరిగిన సమయంలో 3,369 ఎమర్జన్సీ ఓపీలు చేశారు. ఈ ఆరు నెలల్లో 5801 మంది ఇన్‌పేషంట్లుగా వైద్యం చేయించుకున్నారు. ఇలా వైద్యశాలకు వచ్చేవారి సంఖ్య భారీగా పెరిగింది. వీటి కారణంగా 2022–2023 సంవత్సరానికి కాయకల్ప అవార్డును డిసెంబరులో సాధించి రూ.10 లక్షల బహుమతి కూడా గెలుచుకుంది. ప్రభుత్వ సహకారం వైద్యుల తీరు కారణంగా వైద్యశాలకు ప్రజలకు మరింత చేరువైంది.


గర్భిణీలతో సమావేశాలు

వినూత్న కార్యక్రమాలతో ప్రజల్లోకి చేరువ...

ప్రస్తుతం ఇక్కడ వైద్యశాలలో చేస్తున్న వినూత్న కార్యక్రమాలు ప్రజల్లోకి వెళుతున్నాయి. వైద్యాధికారి సతీష్ బాబు తన సొంత నిధులతో ఆడపిల్ల పుట్టిన ప్రతి తల్లికి చీరను బహూకరిస్తారు. పుట్టిన ప్రతి బిడ్డకు దాతల సహకారంతో కిట్లు అందిస్తున్నారు. గర్భిణులకు ప్రత్యేకంగా పౌష్టికాహారం అందిస్తున్నారు. చిన్నారులకు ముగ్గుల పోటీలు, ఆరోగ్య పోటీలు నిర్వహించి ప్రత్యేక బహుమతులు అందిస్తున్నారు. గిరిజన కాలనీల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుంటూ వారిని వైద్యశాలకు ప్రసవాలకు వచ్చేలా చేస్తూ వారికి శానిటరీ నాప్కిన్లు ఉచితంగా అందిస్తున్నారు. ఇలా కొత్త కొత్త కార్యక్రమాలతో ప్రజల్లోకి చేరువైంది.

పేషంట్ మాకు వీఐపీ



మా వైద్యశాలకు పేషంట్ వీఐపీ అని అందరం సమావేశంలో మాట్లాడుకున్నాం. వారిని గౌరవిస్తూ వచ్చిన వ్యాధి తగ్గించి పంపించాలని పనిచేస్తున్నాం. ఎమ్మెల్యే మహీధరరెడ్డి సహకారంతో వైద్యశాలకు పలు పరికరాలు వచ్చాయి. వాటి ద్వారా మెరుగైన వైద్యం అందిస్తున్నాం.

– సతీష్ బాబు, ఇన్‌చార్జ్ వైద్యాధికారి

వైఎస్సార్ సీపీ అభ్యర్థులదే గెలుపు


పామూరు: పట్టభద్రుల ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హుసేన్‌రెడ్డి, నాయకులు


పి.నాగులవరంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్న జెడ్పీటీసీ, మాజీ జెడ్పీటీసీలు గుంటక, రామన


పీసీ పల్లి: సచివాలయ ఉద్యోగికి కరపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి

పామూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డిలదే విజయమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దూబగుంట్ల, బుక్కాపురం, తాతాయపల్లె, పడమటిపల్లె, వెంకటాపురం, కొత్తపల్లె గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓట్ల కోసం గ్రామాల్లో ముమ్మర ప్రచారం నిర్వహించారు. నమూనా బ్యాలెట్ పత్రాలను చూపి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాసులరెడ్డి, మాజీ సర్పంచ్ కందుల శివరామిరెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

వెలిగండ్ల మండలంలో...

వెలిగండ్ల: వైఎస్సార్ సీపీ ప్రకటించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యరి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతనేని చంద్రశేఖరరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన తిరుపతిరెడ్డి కోరారు. మండలంలోని గుడిపాటిపల్లి, పి.నాగులవరం, పి.రాళ్లపల్లి, ఇమ్మడిచెరువు, వెదుళ్లచెరువు, మోటుపల్లి, రామలింగాపురం, రామగోపాలపురం, వెలిగండ్ల గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు టి.సురేష్ బాబు, గజ్జల నాగేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్, కౌన్సిలర్, కన్వీనర్, గృహ సారథులు

పీసీ పల్లి మండలంలో...

పీసీ పల్లి: మండల పరిధిలోని మురుగమ్మి, చినవరిమడుగు, నేరేడుపల్లి సచివాలయాల పరిధిలోని ఉద్యోగులు, వలంటీర్లు, పట్టభద్రులు, టీచర్లకు వైఎస్సార్ సీపీ నాయకులు కరపత్రాలు అందజేశారు. పార్టీ మండల కన్వీనర్ బొర్రారెడ్డి, సచివాలయ కన్వీనర్ శీలం సుదర్శనం, జెడ్పీటీసీ పెద్దిరెడ్డి లక్ష్మీకాంతం ఓకేరెడ్డి, యూత్ అధ్యక్షుడు మేకల మాల్యాద్రి, ఎంపీటీసీ గుంటగాని భాస్కర్, సర్పంచ్‌లు బలసాని మోహన్, నల్లగంగుల శ్రీను, నాయకులు పరుచూరి రమేష్, రవణయ్య తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కనిగిరి రూరల్: కనిగిరిలోని 13వ వార్డులో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సయ్యద్ రిజ్వాన ఖాలక్, నాయకులు గుడిపాటి నాయబా, సాదిక్, నాగూర్‌బీ, గృహ సారధులు బాదుల్లా, రఫీ, షకీల్, నాయబా, బాబు, చాందు, కమాల్ వలి, మున్నా, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాలినేనికి ఘన సన్మానం


బాలినేనిని గజమాలతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, నాయకులు

కనిగిరి రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష సమావేశానికి కనిగిరి వచ్చిన సందర్భంగా వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిని, ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డిని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. పార్టీ శ్రేణులు ఎంతో ఉత్సాహంగా సన్మాన కార్యక్రమంలో పాల్గొని గజమాలతో సన్మానించారు. తొలుత బాలినేని శ్రీనివాసరెడ్డి, జంకె వెంకటరెడ్డిలకు ఘనంగా స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బుర్రాతో పాటు రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యన్నారాయణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వైఎం ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, మాణిక్యరావు, జెడ్పీటీసీలు కస్తూరిరెడ్డి, ప్రకాశం, లక్ష్మీకాంతంరెడ్డి, దద్దాల నారాయణ, మేకల శ్రీను, గుంటక తిరుపతిరెడ్డి, అత్యాల జఘన్య, డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, చప్పిడి సుబ్బయ్య, రామన తిరుపతిరెడ్డి, చెరుకూరి సతీష్ చౌదరి, గంగసాని హుస్సేన్‌రెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రంగనాయకులరెడ్డి, సుబ్బారెడ్డి, యక్కంటి శ్రీనివాసులరెడ్డి, జీ బొర్రారెడ్డి, గజ్జల వెంకటరెడ్డి, ఎస్‌కే జిలాని, సాల్మన్, వేల్పుల వెంకటేశ్వర్లు, అట్లా రామచంద్రారెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీహరిరెడ్డి, సిద్దారెడ్డి, కాసుల గురవయ్య, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ టీఎఫ్ నాయకులు కూడా బాలినేని, జంకె, బుర్రా, చింతలచెరువులతో పాటు శ్యాంప్రసాద్‌రెడ్డిని సన్మానించారు. బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రైవేట్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు దిద్దే అంబేద్కర్, పొలిచర్ల రషీద్, నాయకులు వినతిపత్రం అందజేశారు.

13న ఘాట్ రోడ్ అభివృద్ధికి శంకుస్థాపన

- రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్
- రూ.5 లక్షల విరాళం ప్రకటించిన ఎంపీపీ వాకా వెంకటరెడ్డి

మర్రిపూడి: పృథులగిరి లక్ష్మీ నృసింహస్వామి ఆలయానికి చేరుకునే ఘాట్ రోడ్డును తారు రోడ్డుగా మార్చేందుకు ఈ నెల 13న శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ పేర్కొన్నారు. తిరునాళ్ల సందర్భంగా సోమవారం రెడ్ల అన్నదాన సత్రం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పుణ్యక్షేత్రం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మాదాసి వెంకయ్య మాట్లాడుతూ.. ధార్మిక సేవా కార్యక్రమాలు హిందూ సంప్రదాయ ఔన్నత్యాన్ని చాటుతాయన్నారు. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. పృథులగిరి ఘాట్ రోడ్‌ను తారు రోడ్డుగా మార్చేందుకు తన వంతుగా రూ.5 లక్షలు అందిస్తానని ప్రకటించారు. స్వామి వారి ఆలయంలో కొండపి ఎమ్మెల్యే డీబీవీ స్వామి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేట్ డైరెక్టర్ పల్లెర్ల నర్సింహారెడ్డి, దొనకొండ ఎంపీపీ ఉషామురళి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ అరుణమ్మ, మర్రిపూడి, చిమట సొసైటీ అధ్యక్షులు బీవీ భాస్కర్‌రెడ్డి, మాకినేని వెంకట్రావు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బోద రమణారెడ్డి, నాయకులు మాచేపల్లి నాగయ్య, ఇనుకొల్లు మాదిరెడ్డి, సారెడ్డి యోగిరెడ్డి, సారెడ్డి పుల్లారెడ్డి ఉన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్

270 మందికి వైద్య పరీక్షలు


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

టంగుటూరు: వెల్ఫేర్ అసోసియేషన్ ఫర్ ఆర్ఫాన్స్ ఓల్డర్, విడోస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో కిమ్స్ ఆస్పత్రి వైద్యులు మర్లపాడు బాపిస్ట్ చర్చి వద్ద సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 270 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి తాళ్లూరి ఆశీర్వాదం, అసోసియేషన్ ప్రెసిడెంట్ పాల్, వైస్ ప్రెసిడెంట్ పేతురు, సెక్రటరీ సునీల్, డాక్టర్ రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వల్లీ భుజంగేశ్వర ఊంజల్‌సేవ


ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న భక్తులు

పామూరు: స్థానిక శ్రీవల్లీ సమేత భుజంగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వల్లీ, భుజంగేశ్వర ఉత్సవమూర్తుల ఊంజల్ సేవను అర్చకులు వేద మంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు ఎంవీ శివప్రసాద్ మొదట భుజంగేశ్వరస్వామి మూలవిగ్రహమూర్తికి ఏకాదశ రుద్రాభిషేకం, వల్లీ అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమపూజ నిర్వహించారు. అనంతరం వల్లీ, భుజంగేశ్వర ఉత్సమూర్తులను వేడుకగా మంగళవాయిద్యాల నడుమ అద్దాల మండపంకు తరలించి ఊంజల్‌సేవ నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గుర్రం వెంకటేశ్వర్లు, పుట్లూరి రామయోగీశ్వరరెడ్డి, దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాకర్ల వెంకటేశ్వర్లు

వెలిగండ్ల: శనగల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని మొగళ్లూరు ఆర్‌బీకేలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకర్ల మాట్లాడుతూ ప్రభుత్వం శనగల మద్దతు ధర క్వింటాకు రూ.5,335 నిర్ణయించిందన్నారు. శనగలు కొనుగోలు చేయాలనుకునే రైతులు తప్పనిసరిగా ఆర్‌బీకేలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.రంగాకృష్ణ, ఆర్‌బీకే, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

90 శాతం రాయితీతో డ్రిప్

హనుమంతునిపాడు: పండ్ల తోటలు సాగు చేసే రైతులకు 90 శాతం రాయితీపై డ్రిప్, గిడ్డంగిలు, 40 శాతం రాయితీపై పండ్ల తోటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని హార్టీకల్చర్ అధికారి డి.సంధ్యా తెలిపారు. సోమవారం హనుమంతునిపాడులో తోట బడి కార్యక్రమం నిర్వహించారు. నిమ్మతోటలు, జామ, దానిమ్మ, మిరప సాగును పరిశీలించారు. నిమ్మకు పేను బంక, ఎండు పుల్ల, కాయ మంగు, వేరు కుళ్లు, మాను బంక, ఆకుమచ్చ తెగుళ్లు ఉన్నట్లు గుర్తించారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సలహాలు, సూచనలు అందించారు.

98 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికి ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా సోమవారం ముప్పల్లపాడు గ్రామంలో డాక్టర్ మూరక ప్రతాప్‌రెడ్డి 98 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి పక్షవాతం వ్యాధి, కిడ్నీ తదితర వ్యాధులతో బాధపడుతున్న వారి వద్దకు వెళ్లి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, రక్తహీనతతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచలిచ్చారు. హెచ్‌వో పద్మజ, ఏఎన్ఎం టి.సుజాత, శాలు, 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.